ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024 | 5



భీమేశ్వరాలయంలో సంప్రోక్షణ
రేపటి నుంచి భక్తులకు యథావిధిగా దర్శనాలు
7లో

జిల్లా స్థాయిలో విజన్ ప్లాన్

జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లకు జిల్లాస్థాయిలో విజన్ ప్లాన్‌ను రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజన్ ఆంధ్రా 2047లో భాగంగా రానున్న ఐదేళ్లకు జిల్లా విజన్ ప్లాన్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం డాక్యుమెంట్‌ను రూపొందించే మార్గదర్శకాలను త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని పేర్కొన్నారు. శాఖల వారీగా అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాల్సిందిగా జేసీ సూచించారు. జిల్లా ప్రణాళికను సూచించే కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 13 నుంచి 31 వరకు ప్రిపరేటర్ ఫేజ్ ఉంటుందని, ఈ ఫేజ్‌లో భాగంగా ఆగస్టు 13న ముఖ్య ప్రణాళికా అధికారులకు వర్క్‌షాప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, మండలస్థాయి ప్రణాళిక రూపొందించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి ప్రణాళికలపై చర్చించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబరు 20లోగా రిపోర్టింగ్ ఫేజ్‌లో భాగంగా ఆన్‌లైన్ పోర్టల్ డేటాను నింపే కార్యక్రమం జరుగుతుందని, అక్టోబరు 2న జిల్లాస్థాయి ప్రణాళికను ఆవిష్కరించనున్నట్లు జేసీ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్సులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జిల్లా ప్రణాళికపై సీఎం చంద్రబాబు సమీక్ష

గత ఐదేళ్ల విధ్వంసకర పాలనలో నష్టపోయాం : సీఎం

కష్టపడి పనిచేయండి : కలెక్టర్లకు చంద్రబాబు సూచన

కోనసీమ జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించిన సీఎం



ఇతర జిల్లాల కలెక్టర్లతో మహేష్‌కుమార్



అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులంతా కష్టపడి పనిచేయాలి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసకర పాలన వల్ల అందరూ నష్టపోయాం. వాటిని అధిగమించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అధికారులు, కలెక్టర్లు అంకిత భావంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హాజరయ్యారు. జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలపై నివేదికలందించారు. పర్యావరణ ప్రగతి, రైల్వేలైన్ అభివృద్ధితో పాటు జిల్లాలో చేపట్టాల్సిన పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించిన కొన్ని అంశాలను సమావేశంలో ప్రస్తావించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎస్, డీజీపీలతో పాటు పలువురు మంత్రులు, ఐఏఎస్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యానికి కలెక్టర్లు కృషి చేయాలని సూచించారు. 'కలెక్టర్ల సదస్సు చరిత్రను తిరగరాయబోతుంది. ప్రజావేదికలో ఆనాటి సీఎం కలెక్టర్ల సదస్సు పెట్టి ఆ తరువాత కూలగొట్టేశారు. విధ్వంసంతో పాటు కష్టపడి పనిచేసే అధికారులను పక్కన పెట్టేశారు. బ్లాక్‌మెయిల్ చేసే అధికారులను, రాజకీయ నాయకులను ప్రోత్సహించారు. ఏపీ బ్రాండ్ పేరును దెబ్బతీశారు. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్లు రాష్ట్రానికి పట్టిన చెడ్డపేరును తొలగించి అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అందరి సహకారం, సమన్వయంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని, ప్రజాప్రతినిధులు కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లే ప్రతి సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి వాటిని పరిష్కరించి వారి గౌరవాన్ని ప్రజల్లో పెంచే బాధ్యత అధికారులపై ఉందన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 212 అర్జీలు

అర్జీలు స్వీకరించిన డీఆర్వో

అమలాపురం టౌన్, ఆగస్టు 5: సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పోటెత్తారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ యల్లారావు, సమగ్ర శిక్షా డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదనరావుతో కలిసి డీఆర్వో 212 అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి భీమేశ్వర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఈవో ఎం.కమలకుమారి, చేనేత జౌళిశాఖ అధికారి మెట్టి గౌరీశంకరరాజు తదితరులు పాల్గొన్నారు



కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల నిరసన

ఉపాధి కూలీల నిరసన

కూలీ డబ్బులైనా ఇవ్వండి. తిండి అయినా పెట్టండి అంటూ ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలు కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు ఏపీ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఉపాధి కూలీలకు ఈ ఏడాది మే 19 తర్వాత ఇంత వరకు వేతనాలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. రూ.72 కోట్ల మేర కూలీల బకాయి వేతనాలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూలీలకు ఏడాదికి 200 రోజులుగా పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు సఖిలే సూర్యనారాయణ, పొలమూరి శ్రీనివాసరావు, తాడి శ్రీరామమూర్తి, ఇసుకపట్ల మంగాదేవి, ఎం.రాజేశ్వరి, మంగాలక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 21 ఫిర్యాదులు



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా

అమలాపురం టౌన్, ఆగస్టు 5: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా అర్జీలు స్వీకరించారు. పరిష్కార వ్యవస్థకు 21 ఫిర్యాదులు అందగా వాటిలో సివిల్ వివాదాలు ఐదు, ఇతర సమస్యలు తొమ్మిది, కుటుంబ కలహాలపై ఏడు ఫిర్యాదులు అందాయి. చట్ట పరిధిలో సత్వరమే ఆ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ల పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

కిలో రూ.150

భారీగా తగ్గిన చికెన్ ధరలు



మండపేట, ఆగస్టు 5: గత నెలలో కిలో చికెన్ ధర రూ.280.. ఈ ధరను చూసి కొనుగోలుదారులు వామ్మో అన్నారు. అయితే అప్పుడు కొండెక్కిన ధర ఇప్పుడు దిగింది. ఇప్పుడు మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.150 ఉంది. అకస్మాత్తుగా ధర తగ్గడానికి బాయిలర్ కోళ్ల ఉత్పత్తి పెరగడమే కారణమని పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఆషాఢమాసంలో చికెన్ ధరలు పెరగడంతో చాలా మంది ఇబ్బందిగానే కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు ధర తగ్గడంతో వారంతా ఊరట చెందారు. ఇక కోడి లైవ్ ధరలు కూడా తగ్గాయి. మార్కెట్‌లో గత నెలలో లైవ్ కోడి కిలో రూ.140 ఉండగా ఇప్పుడు రూ.105కి చేరింది. కిలో రూ.280 నుంచి రూ.320 వరకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు ఉన్న ధరను చూసి తెగ సంతోషపడిపోతున్నారు. మే, జూన్‌లో ఎండల కారణంగా వేలాదిగా కోళ్లు మరణించాయి. ఆ ప్రభావం సరఫరాపై పడింది. దీంతో ఒక్కసారిగా రేటు పెరిగింది. అయితే తర్వాత కోళ్ల ఉత్పత్తి బాగా పెరగడం వల్ల ఇప్పుడు మార్కెట్‌లోకి ఇబ్బడిముబ్బడిగా కోళ్లు వచ్చేస్తున్నాయి. దీంతో బాయిలర్ చికెన్ ధర పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.



సఖినేటిపల్లి రేవులో మళ్లీ రాకపోకలు 7లో

అబుదాబీలో మహిళ ఆక్రందన - మెయిన్

స్వదేశానికి రప్పించాలని వేడుకోలు

నదీకోత నివారణకు రైతుల ఆందోళన

- వార్త 8లో



కౌలు రైతుల నిరసన

గుర్తింపు కార్డులు అందించాలి

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించి బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చే కార్డులకు సంబంధించి భూ యజమానికి సంతకం నిబంధనను తొలగించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు పేర్కొన్నారు. జిల్లా నాయకులు బుంగ సత్యనారాయణ, శ్రీరామమూర్తి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫాగింగ్ నిర్వహణకు చర్యలు

కలెక్టర్, డీపీవో ఆదేశాలతో పంచాయతీల్లో మిషన్లకు రిపేర్లు

మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది



ఆత్రేయపురం, ఆగస్టు 5: వరదలు, వర్షాలు కారణంగా గ్రామీణ ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్య బారిన పడకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలపై అధికార యంత్రాగం అప్రమత్తమయ్యింది. మూలనపడి ఉన్న ఫాగింగ్ మిషన్లను రిపేర్లు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 384 పంచాయతీలకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా మూడేళ్ల క్రితం ఫాగింగ్ మిషన్లను పంపిణీ చేశారు. ఒక్కొక్క మిషన్ సుమారు రూ.45 వేలుతో కొనుగోలు చేసి పంచాయతీలకు అందించారు. కొత్తలో కొన్ని రోజులు ఫాగింగ్ నిర్వహించి ఆ తర్వాత మూలన పడేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ప్రజారోగ్యం, పారిశుధ్యంపై దృష్టి సారించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో మూలన పడి ఉన్న ఫాగింగ్ మిషన్లను రిపేర్లు చేయించి వినియోగించే కార్యక్రమానికి శ్రీకారం చూట్టారు. అప్పట్లో ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో 17 ఫాగింగ్ మిషన్లు అందించారు. ప్రస్తుతం వాటిని రిపేర్లు చేయించేందుకు ఈవోపీఆర్డీ శ్రీనివాస్ చర్యలు తీసుకున్నారు. కలెక్టర్, డీపీవో ఆదేశాల మేరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఫాగింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న ఐ.పోలవరం మండల రైతులు

ఆటోమెటిక్ తలుపులతో మేలు

ఐ.పోలవరం మండల రైతులు

పెరుమళ్లరాజు డ్రెయిన్‌పై ఆధారపడి 9వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ఏటా ముంపుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బ్రిటిష్ తరహాలోనే స్లూయిస్‌కు ఆటోమెటిక్ తలుపులు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు సత్తి శ్రీనివాసరావు, శీలం సత్యనారాయణ, ఎం.దుర్గారావు, ఉంగరాల ధర్మారావు, దంగేటి వీరవెంకటసత్యనారాయణ తదితరులు అర్జీ అందించారు. ప్రస్తుతం ఆటోమెటిక్ తలుపులు తొలగించేయడం వల్ల ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, దుబ్బల్లంక, మురమళ్ల తదితర ప్రాంతాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.



జేసీ నిషాంతితో ఐసీడీఎస్ ఉద్యోగులు

ఐసీడీఎస్ ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు

అమలాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎంపికచేసి సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ విభాగంలో ఖాళీగా ఉన్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్, నాన్ ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్, అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటరు, డేటా ఎనలిస్టు, అవుట్‌రీచ్ వర్కర్ పోస్టులకు గత నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించి జిల్లా జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. వారికి నియామక ఉత్తర్వులను జేసీ అందజేసి వారం రోజుల్లోపు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

'పిచ్చుకలంక' అభివృద్ధికి అడుగులు

జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించిన ఆర్డీవో



పిచ్చుకలంక పర్యాటక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ఆత్రేయపురం, ఆగస్టు5: ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంక పర్యాటక కేంద్రాన్ని సోమవారం కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటక కేంద్రాన్ని స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పంచాయతీలోని సర్వే నెం 155లో పిచ్చుకలంక 56 ఎకరాలలో విస్తరించింది. అఖండ గోదావరి చెంతనే పిచ్చుకలంక ఏర్పడటంతో ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ చెంతనే నాలుగు దశాబ్దాల క్రితం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన నిర్వహించింది. తదనంతరం టీడీపీ హయాంలోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి 56 ఎకరాలలో డ్రెడ్జింగ్ పనులు చేశారు. ఈ నేపథ్యంలో పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తిరిగి చర్యలు చేపడుతోంది. ఈ మేరకు జేసీ నుంచి ఆదేశాలు రావడంతో పిచ్చుకలంక స్థితిగతులను ఆర్డీవో స్వయంగా పరిశీలించారు. దీనికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. టూరిజం మంత్రి కందుల దుర్గేష్ పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీవో వెంట ఆర్ఐ భవాని, వీఆర్వోలు ఉన్నారు.



దాతలకు చిత్రపటం అందిస్తున్న అధికారులు

నిత్యాన్నదానానికి రూ.2.25 లక్షలు

అంతర్వేది, ఆగస్టు 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనం అనంతరం కాకినాడ వలసపాకలకు చెందిన కోకా పార్వతిప్రమీలశేషకుమారి, కుటుంబ సభ్యులు సోమవారం నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2,25,612 విరాళాన్ని అందించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.వి జయసారథి దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సత్యకిరణ్, అన్నదానం స్వామి, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

అన్నవరం, ఆగస్టు 5: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర 134వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు అనివేటి మండపంలో ప్రత్యేక వేదికపై స్వామి ,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, జపాలు, మంటపారాధనలు, నవగ్రహ జపాలు, చండీ పారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పండితులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు.

నేడు సత్య విదియ: స్వామివారు స్వయం భువునిగా 1891 ఖర నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించారు. దీంతో శ్రావణ శుద్ధ విదియను సత్య విదియగా పిలుస్తారు. మంగళవారం వేకువ జామున రెండు గంటలకు సుప్రభాత సేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి 10 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఊరేగిస్తారు. రాత్రి 7.30 గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం జరుగుతుంది.





వేద పండితులకు దీక్షా వస్త్రాలు అందజేసి పూజల్లో పాల్గొన్న చైర్మన్ రోహిత్



మంత్రి సుభాష్ తల్లిదండ్రులతో సంప్రోక్షణ పూజలు చేయిస్తున్న అర్చకస్వాములు

భీమేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు

▸ రేపటి నుంచి భక్తులకు యథావిధిగా భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు 5: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులను కేంద్ర పురావస్తు శాఖ పూర్తి చేసిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో సంప్రోక్షణ పూజలు జరిపి బుధవారం ఉదయం 11 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పరిషత్, కుచ్చత్రయం, మంటపారాధన, రుత్విక్‌వరుణలు, దీక్షాధారణ జరిగాయి. మధ్యాహ్నం కృష్ణయజుర్వేద పారాయణ, గణపతి హోమం, వాస్తు హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు పూజలను జరిపించగా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో పీటీవీ సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కే గోపాల్‌బాబు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ నాయకుడు పెంకె సాంబశివరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



'లోవ' హుండీల ఆదాయం
రూ.53.61 లక్షలు

తుని రూరల్, ఆగస్టు 5: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారికి భక్తులు కానుల వర్షం కరిపించారు. ఎన్నడూ లేనంతగా ఆషాఢ మాసం 30 రోజుల్లో అమ్మవారికి రూ.53,61,960 ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ప్రత్యేక అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అధిక ఆదాయం వచ్చిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.



హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది





గొల్లప్రోలులో ఆయ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ను లాంచ్ చేస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్. నిర్మాత బన్నీ వాసు

గొల్లప్రోలులో 'ఆయ్'

గొల్లప్రోలు, ఆగస్టు 5: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సినిమాల సందడి ప్రారంభమైంది. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో జీఏ2 పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిన 'ఆయ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం జరిగింది. మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా నార్నే నితిన్, నయన్‌సారిక హీరో, హీరోయిన్లుగా నిర్మితమైన ఈ చిత్రం ట్రైలర్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు లాంచ్ చేశారు. గ్రామీణ వాతావరణంలో అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా వినోదాత్మకంగా చిత్రాన్ని నిర్మించామని, ఈ నెల 15న విడుదలవుతుందని నిర్మాత బన్నీవాసు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు పిఠాపురం హాట్ టాపిక్‌గా మారిందని, అందుకే ఇక్కడ ప్రీ రిలీజ్ ఈవెంట్ చేశామని... సినిమా హిట్ కావడం పక్కా అన్నారు. ట్రైలర్‌ను లాంచ్ చేసిన వర్మ, శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం సినిమా వేడుకలకు వేదిక కావడం ఆనందకరమైన విషయమన్నారు. హీరో, హీరోయిన్లు, ఇతర నటులు స్టెప్పులు వేసి ప్రేక్షకులను అలరించారు. ఆయ్ ... మేం ఫ్రెండ్సండి ట్యాగ్‌లైన్‌తో ఉన్న ఈ సినిమాకు అంజి.కె.మణిపుత్ర దర్శకత్వం వహించారు. విద్యా కొప్పినీడి, అంకిత్, కసిరెడ్డి, ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేసి ప్రేక్షకులను అలరించిన హీరో నితిన్, హీరోయిన్ నయన్‌సారిక

సందడిగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్

ఆకట్టుకున్న ట్రైలర్

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా: నిర్మాత బన్నీవాసు

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని 'ఆయ్' సినిమా యూనిట్ సందర్శించింది. చిత్రం విజయవంతం కావాలని కోరుతూ కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు పూజలు చేశారు. నిర్మాత బన్నీ వాసు, హీరో, హీరోయిన్లు నార్నే నితిన్, నయన్‌సారిక తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గింది...
పంటు కదిలింది

అంతర్వేది, ఆగస్టు 5: ఇటీవల వచ్చిన వరదలకు సుమారు పది రోజులకు పైగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి నుంచి నర్సాపురం పంటుపై రాకపోకలకు అంతరాయం కలిగింది. సఖినేటిపల్లిరేవులో వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నట్టు పంటు నిర్వాహకులు తెలిపారు.



పంటుపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

వలకు చిక్కిన 'శీలావతి'

16 కిలోలు రూ.3,200కి విక్రయం

మోతుగూడెం, ఆగస్టు 5: మోతుగూడెం పరిధిలోని మంగంపాడు వద్ద సీలేరు నదిలో బెంగాలీ మత్స్యకారుడు కేనా సోమవారం వేటకు వెళ్లాడు. అతని వలకు శీలావతి జాతికి చెందిన చేప చిక్కింది. 16 కిలోల బరువున్న దీనిని మోతుగూడెం మార్కెట్లో రూ.3,200కు విక్రయించాడు.



ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలపై దృష్టి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, మహిళల హక్కులు, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలపై ప్రజలను చైతన్యం చేసే దిశలో భాగంగా హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈనెల 15 లోపుగా క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళల హక్కులు, వారి ఆరోగ్య పరిరక్షణ, మానసిక రుగ్మతలు, వితంతువుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో రహదారి మార్గాలు సరిగాలేని కుగ్రామాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

భార్యను హత్య చేసిన
భర్త అరెస్టు

ధవళేశ్వరం, ఆగస్టు 5: భార్య తలపై రాయితో కొట్టి ఆమె మరణానికి కారణమైన భర్త ధనాల మహేష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీటీఆర్ఐకు చెందిన యర్నాకుల శ్యామల (24), ధవళేశ్వరానికి చెందిన మహేష్ 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. బొమ్మూరులోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు పడుతుండడంతో చాలాసార్లు పెద్దలు నచ్చజెప్పి సమస్యను పరిష్కరించారు. శ్యామలపై అనుమానం పెంచుకున్న మహేష్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఆమెతో గొడవ పడి సిమెంటు రాయితో తలపై కొట్టి పారిపోయాడు. తలపగిలి రక్తం వస్తుండడంతో చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మణికంఠ ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ బి.తులసీధర్ దర్యాప్తు చేపట్టి నిందితుడు మహేష్‌ను బొమ్మూరు టిడ్కో గృహాల వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ఏపీ మల్లవరంలో ప్రబలిన
విష జ్వరాలు

వంద మందికి పైగా జ్వరపీడితులు... పలువురికి డెంగ్యూగా గుర్తింపు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో విష జ్వరాలు ప్రబలాయి. గ్రామమంతా జ్వరంతో వణుకుతోంది. పదుల సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగ్యూగా నిర్ధారణ కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వాతారవరణంలో మార్పుల ప్రభావంతో ఏపీ మల్లవరంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారంలో సుమారు వంద మందికిపైగా జ్వరం, రొంప, దగ్గు, వంటి నొప్పులతో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. ప్రతి ఇంట్లోనూ కనీసం ఒకరు జ్వరంతో బాధపడటం గానీ, చికిత్స పొంది తేరుకోవడం గానీ జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. జ్వరం రాగానే తీవ్రంగా నీరసం వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. జ్వరం, ఇతర లక్షణాలతో బాధపడుతున్న వారు ప్రైవేటుగా పరీక్షలు చేయించుకున్నారు. డెంగ్యూగా నిర్ధారణ అవుతుండడంతో కాకినాడ, పిఠాపురం ల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాకినాడ సర్పవరం-మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఏపీ మల్లవరం గ్రామానికి చెందిన 30 మంది డెంగ్యూతో బాధపడుతూ చికిత్స నిమిత్తం చేరారు. వీరిలో కొంతమంది డిశ్చార్జి కాగా ఇంకా 12మంది చికిత్స పొందుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారు ఏపీ నగరం, చేబ్రోలు పీహెచ్‌సీలకు, పిఠాపురం సీహెచ్‌సీకి వస్తున్నారు. పలువురు పిఠాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం చేరారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి మందులు అందజేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు.





కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో డెంగ్యూతో చికిత్స పొందుతున్న రాజేశ్వరి, సుధాకర్‌రెడ్డి

అన్న క్యాంటీన్లు సిద్ధం

ఈ నెల 15న తెరుచుకోనున్న 54 క్యాంటీన్లు ... పాతవి 51, కొత్తవి 3

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5: జోన్-2 పరిధిలో 54 అన్న క్యాంటీన్లు ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయని రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. జోన్-2లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 4, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 5, ఏలూరు పరిధిలో 4, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 3, భీమవరం పరిధిలో 3, తాడేపల్లిగూడెం పరిధిలో 3, గుడివాడ పరిధిలో 2... వీటితో పాటుగా మరో 23 మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఒక్కొక్క అన్న క్యాంటీన్లు ఉన్నాయి. వీటిలో అమలాపురం, జంగారెడ్డిగూడెం, గొల్లప్రోలు ప్రాంతాల్లో మరో మూడు కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా జోన్-2 పరిధిలోని 54 క్యాంటీన్లను ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసివేయడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారిపోయాయన్నారు. క్యాంటీన్లలోని కంప్యూటర్లు, ఫర్నిచర్ కూడా లేకపోవడంతో తిరిగి టీడీపీ ప్రభుత్వం భవనాల రిపేర్ల నిమిత్తం, ఫర్నిచర్, కంప్యూటర్ల కొనుగోలు నిమిత్తం నిధులు కేటాయించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే అన్న క్యాంటీన్లు తిరిగి తెరవడానికి ఏర్పాట్లు చేస్తోందని, క్యాంటీన్ల భవనాలకు మరమ్మతులు చేసి వాటిల్లో సౌకర్యాలు కల్పించేందుకు కోట్లు నిధులు విడుదల చేసిందని ఆర్డీ తెలిపారు. వీటికి ఆహారం సరఫరా చేయడానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచిందని, మొత్తం ప్రక్రియను వచ్చే నెల మొదటి వారంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. అన్న క్యాంటీన్ల వల్ల పేదవారికి ఉపయోగమే. వ్యాపారస్తులకు, పల్లెల నుంచి పనిమీద నగరాలకు, పట్టణాలకు వచ్చి వెళ్లే వారికి ఇవి చాలా ఉపయోగపడతాయి. బయట టిఫిన్ చేయడానికే రూ.30నుంచి రూ.80 అవుతోంది. రూ.5కే భోజనం అంటే చాలా మంచిది. కూలి పనులు చేసుకునే వారికి, చిన్న వ్యాపారస్తులకు అంతోఇంతో డబ్బులు కూడా ఆదా అవుతాయని నాగనరసింహారావు చెప్పారు.

తూరంగిలో 55.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డులో గల శుభం కౌంటీ సమీపంలో మూర్తిగారి లేఅవుట్‌లోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 55.90 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని మహేంద్ర లోడ్ కింగ్ ఆప్టిమాలో లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మమత తెలిపారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ నాగరాజు, వీఆర్వో సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి దాడి చేశారన్నారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.2,54,345 ఉంటుందని కనకాల దుర్గారావు, అనపర్తికి చెందిన కోనాల ఆనందరెడ్డి ఇక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేసినట్లు గుర్తించామని... స్పాట్‌లో ఉన్న అతని గుమస్తా కాజులూరుకు చెందిన కనకాల దుర్గారావును అదుపులోకి తీసుకుని ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించామన్నారు. ఆనందరెడ్డి, దుర్గారావులపై 6(ఎ) కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశామని తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామన్నారు.



ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎస్ఈగా తిలక్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా తిలక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజమహేంద్రవరంలో డీఈ, ఈఈగా సేవలందించిన తిలక్‌కుమార్ పదోన్నతిపై ఏపీఈపీడీసీఎల్ కార్పొరేషన్ మేనేజరుగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. అటుపై రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రాజమహేంద్రవరం ఎస్ఈగా విధులు నిర్వహించిన టీవీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై సీజీఎంగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఎస్ఈ బాధ్యతలు స్వీకరించిన తిలక్‌కుమార్‌ను సోమవారం జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజమహేంద్రవరంలో విశేషంగా సేవలందించిన తిలక్‌కుమార్ తిరిగి ఎస్ఈగా రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

తిలక్‌కుమార్‌ను సన్మానిస్తున్న గొట్టిముక్కల అనంతరావు



నాట్లేసిన ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వెళ్తుండగా వట్టిగెడ్డ గ్రామ శివారులో రోడ్డు పక్కన పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతులు ఆమె కంటపడ్డారు. వెంటనే ఆమె కారు ఆపి పొలంలోకి దిగి రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. కాసేపు వారితో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా వరి నాట్లు వేశారు.

...రాజవొమ్మంగి

విద్యా కిట్లు పంపిణీ

అల్లవరం, ఆగస్టు 5: బోడసుకుర్రు పల్లిపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి పంపిణీ చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, ఓలేటి పరమేశ్వరరావు, కోలా విజయదుర్గా, హెచ్ఎం వి.కనకదుర్గా, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రమాదాలకు నిలయంగా కెనాల్ రోడ్డు
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- అభివృద్ధి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావన

వేమగిరి - సామర్లకోట కెనాల్ రోడ్డు గోతులమయం



మండపేట మండలం కేశవరం - ద్వారపూడి మధ్య గోతులు మయంగా మారిన కెనాల్ రోడ్డు

మండపేట, ఆగస్టు 5: సామర్లకోట - వేమగిరి కెనాల్ రోడ్డు గోతులమయంగా మారింది. నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ఈరహదారి మండపేట మండలం కేశవరం - ద్వారపూడి మధ్య కెనాల్ రోడ్డు పూర్తిగా గోతులు మయం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. జెడ్.మేడపాడు, కేశవరం ద్వారపూడి కెనాల్ రోడ్డు చెంతనే ఆక్రమణలు జోరందుకున్నాయి. దీంతో ఈరోడ్డు ఇరుకుగా మారింది. కాకినాడ, సామర్లకోట, అనపర్తి, మండపేట, రామచంద్రపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఈకెనాల్ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈరోడ్డు కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా కెనాల్‌రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా వేమగిరి - సామర్లకోట కెనాల్ రోడ్డు విస్తరణ అంశాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడ పోర్టు, రాజమ హేంద్రవరానికి ఎంతగానో దోహదపడే ఈరోడ్డు విస్తరణ గతంలో చేపట్టినప్పటికి నిధులు కొరత కారణంగా పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వంలో వేమగిరి - సామర్లకోట కెనాల్ రోడ్డును అభివృద్ధి చేస్తే మండపేట, అనపర్తి మండలాలు ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అలాగే మండపేట మండ లంలో మండపేట - ఏడిద రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది.

తొలగించిన వారిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలి


కలెక్టరేట్ ఎదుట అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

అమలాపురం టౌన్, ఆగస్టు 5: రాజకీయ కారణాలతో తొలగించిన వారిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై నేతల వేధింపులు అదుపు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఎమ్మెల్సీ ఐళ్ల వెంకటేశ్వరరావు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. రాజకీయ కారణాలతో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కోశాధికారి జె.కృష్ణవేణి, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుభాషిణి, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మితో పాటు మధ్యాహ్న భోజన పథకం కంటింజెంట్ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

నదీ కోతను నివారించాలని రైతుల ఆందోళన

మామిడికుదురు, ఆగస్టు 5: గోదావరి తీరంలో నదీ కోత తీవ్రంగా ఉందని, నదీ కోతను నివారించాలంటూ పాశర్లపూడిలోని రైతులు సోమవారం వైనతేయ వారధి వద్ద ఆందోళన చేశారు. రూ.లక్షలు విలువచేసే కొబ్బరి తోటలు నదీ గర్భంలో కలిసిపోతున్నాయన్నారు. నదీ కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్స్ నిర్మించాలని డిమాండు చేశారు. ప్రతీ సంవత్సరం గోదావరికి వస్తున్న వరదతో నదీ కోత తీవ్రమవుతుందన్నారు. నదీ కోత నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులు మల్లాడి విష్ణు, తోరం నాగేంద్ర, మల్లాడి వీరపండు, పాలూరి సత్తిబాబు, పెమ్మాడి రామమూర్తి, నిమ్మల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


పాశర్లపూడి వైనతేయ వారధి వద్ద రైతుల నిరసన

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ఆలమూరు, ఆగస్టు5: తల్లి పాలతో బిడ్డలకు కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పించి తల్లుల అపోహలను నివృత్తి చేస్తున్నామని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ చెప్పారు. పినపళ్లలో సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వైద్యులు సాయికిషోర్, మలేరియా యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లి పాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పి.ఉమ, వెంకాయ్యమ్మ, కె.కళాంజలి, ఆర్.నాగేశ్వరరావు, యానిమేటర్లు దుర్గ, నాతి సుధారాణి, పాల్గొన్నారు.

మామిడికుదురు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని లూటుకుర్రుపీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈదరాడలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమలో పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: తల్లి పాలు పసి బిడ్డలకు దివ్యౌషధమని వైద్యాధికారులు వివరించారు. ఎస్.యానాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీల ద్వారా తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. గర్భిణులు, బాలింతలతో సమావేశాలు నిర్వహించి నవజాత శిశువులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు ఢిల్లీ ప్రసాద్, లోవ సుధ, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేది: అప్పనరామునిలంక, అంతర్వేది, సఖినేటిపల్లి ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యం గురించి తెలియచేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు ర్యాలీ నిర్వహించారు. బుధవారం వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మీరా ముస్సీసా తెలిపారు. పీఎల్ఎన్ స్వామి, బి.ప్రవీణ, ఎం.మమత, ఎం.బాలశంకర్, బి.మాలతీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వయనాడ్ మృతులకు సంతాపంగా ర్యాలీ


అంబాజీపేటలో వయనాడ్ మృతులకు సంతాప ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

అంబాజీపేట,ఆగస్టు5: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రకృతి విలయం కారణంగా మృతిచెందిన వారికి అఖిలపక్ష నాయకులు సంతాపం తెలిపారు. మెయిన్‌సెంటర్ నుంచి బస్టాండ్ వరకు అఖిలపక్షం నాయకులు ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మకు శాంతిచేకూరాలని నినాదాలు చేశారు. కోకోఫెడ్ ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి, పేబ్యాక్‌టు సొసైటీ ఆర్గనైజేషన్ నక్కా భాస్కర్, అఖిలపక్ష నాయకులు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్, బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి, నాగాబత్తుల సుబ్బారావు, దొమ్మేటి సాయికృష్ణ, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, వాసంశెట్టి పెదబాబు, గుడాల ఫణి, ఆదుర్తి నారాయణమూర్తి, ఉందుర్తి నాగబాబు పాల్గొన్నారు.

భగవన్నారాయణకు ఎస్ఐగా పదోన్నతి



అంబాజీపేట, ఆగస్టు 5: అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పి.భగవన్నారాయణకు ఎస్ఐగా పదోన్నతికి లభించింది. కృష్ణ జిల్లా మచిలీపట్నం బదిలీపై వెళ్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. ఈసందర్భంగా భగవన్నారాయణను సిబ్బందిని సత్కరించారు.

ఐశ్వర్యకు నర్తనబాల అవార్డు

అమలాపురం టౌన్, ఆగస్టు 5: అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన 9వ జాతీయస్థాయి నృత్య పోటీల్లో అమలాపురం శ్రీకళాక్షేత్రం విద్యార్థిని తురగా భానుశ్రీఐశ్వర్య నృత్యంలో అద్భుత ప్రతిభ చాటి నర్తనబాల అవార్డును అందుకున్నారు. కళాక్షేత్రం డైరెక్టర్ పేరి కామేశ్వరిదేవి, పి.దుర్గారావు తదితరులు అభినందించారు.



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

రాజోలు, ఉప్పలగుప్తంలలో ఆందోళన



రాజోలులో నినాదాలు చేస్తున్న ఎస్సీ నాయకులు, ఉప్పలగుప్తం: మాల మహానాడు జేఏసీ నాయకుల ఆందోళన

రాజోలు, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని రాజోలు నియోజకవర్గ ఎస్సీ (మాల) నాయకులు రాజోలులో సోమవారం నినాదాలు చేశారు. రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాలకు చెందిన మాలల సమావేశంలో దళిత నాయకుడు బత్తుల మురళీకృష్ణ ఆధ్వర్యంలో మాలమహానాడు సీనియర్ నాయకుడు నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, అడ్డుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం మాలమహానాడు జేఏసీ మండల కమిటీని ప్రకటించారు. రాజోలు మండల జేఏసీ అధ్యక్షుడిగా మట్టా సురేష్, ప్రధాన కార్యదర్శిగా లిఖితపూడి బుజ్జి, కోశాధికారిగా చింతా మధుకుమార్, ఉపాధ్యక్షుడిగా మందపాటి రాజేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పోతుమూరి రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు, జాలెం భాస్కరరావు, జిల్లెల్ల శ్రీనివాస్, గోగి రవీంద్ర, కాకర విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆందోళన

ఉప్పలగుప్తం, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పలగుప్తంలో ఆందోళన చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కుంచే బాబులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు జల్లి శ్రీనివాస్, పెయ్యల పరశురాముడు, చింతా రామకృష్ణ, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కొంకి వెంకట బాబ్జి, పెయ్యల రాజ్‌కుమార్, పెట్టా అప్పారావు, తాళ్ల లలితా రవి, దేవరపల్లి రాంబాబు, పోలినాటి వెంకటేశ్వరరావు, పెయ్యల రమణ, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై మాదిగల హర్షం

అల్లవరం, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు లూటుకుర్తి చిన్న అధ్యక్షతన బెండమూర్లంకలో మాదిగల సమావేశం నిర్వహించారు. అధినేత మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉతకోట శ్రీనివాసరావు, ముసునూరి రాజు, ఏడుకొండలు, చిట్టుగుళ్ల ప్రసాద్, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీలకు పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష

ఆలమూరు, ఆగస్టు 5: దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిందని ఎస్ఐ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో దారి దోపిడీలకు పాల్పడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై 2023 అక్టోబరు 10న కేసు నమోదు చేశామన్నారు. మరుసటి రోజు దారి దోపిడీలకు పాల్పడిన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం సంజీవ గాంధీనగర్‌కు చెందిన గుబ్బల మోషే, రాజమహేంద్రవరానికి చెందిన పొడుగు శివలను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి మోటారుసైకిల్, కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరాలు రుజువు కావడంతో నిందితులు ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.పది వేలు వంతున జరిమానాను ఆలమూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ విధించారని ఎస్ఐ తెలిపారు. ఈకేసులో వాదనలు శ్రీరాములు వినిపించారని తెలిపారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు


ఆండాళ్ అమ్మవార్కి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరునక్షత్ర ఉత్సవాలు మూడో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ద్రవిడవేద పారాయణం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం రాత్రి ప్రాకారోత్సవం, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ. 1,72,963 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ప్రపంచ స్థాయి కథల పోటీల్లో రత్నాకర్‌కు ప్రథమ బహుమతి



యానాం, అగస్టు 5: ఉషా పక్షపత్రిక, తటవర్తి భారతి సాహితీ సంస్థ (అమెరికా) సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ స్థాయి కథల పోటీల్లో యానా నికి చెందిన కథకుడు రత్నాకర్ పెనుమాకకు ప్రథమ బహుమతి దక్కింది. ప్రపంచ నలుమూలల నుంచి వివిధ దేశాలకు చెందిన కథకలు పాల్గొన్న ఈపోటీలో రత్నాకర్‌కు ప్రథమ బహుమతి లభించింది. తనకు దీంతో 24 కథా బహుమతులు వచ్చాయని, తెలుగు రాష్ట్రాల్లోని 21ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి సన్మానాలు పొందినట్టు తెలిపారు. వ్యక్తిగతంగా తాను ఎవరికి తెలియక పోయినా తనను ప్రోత్సహిస్తున్న పత్రికలకు, సాహితీ సంస్థలకు రత్నాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

అంబాజీపేట, ఆగస్టు 5: ముక్కామల నాలుగు రోడ్ల జంక్షన్‌లో పోలీసులు ఏర్పాటుచేసిన స్టాపర్లను మోటార్‌సైక్లిస్టు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడ్ని 108 అంబులెన్స్‌లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



కె.గంగవరం, ఆగస్టు 5: సత్యవాడలో ఆదివారం రాత్రి బ్రహ్మ కమలం పుష్పాలు వికసించాయి. నున్న శంకరరావు (గురుస్వామి) ఇంటిలో ఎనిమిదేళ్ల క్రితం వేసిన బ్రహ్మ కమలం మొక్కకు పూసిన పుష్పాలు ఆదివారం రాత్రి వికసించాయి.

8న స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు



అమలాపురంటౌన్, ఆగస్టు5: ఈనెల8న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని ఎంపీడీవో జి.మల్లికార్జునరావు సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి అధ్యక్షతన ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈఎన్నికల్లో కీలకమన్నారు. పాఠశాలలఅభివృద్ధికి పాటుపడేవారిని ఎన్నుకోవాలని కోరారు. సమగ్ర శిక్షా జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎంఏకే భీమారావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం మాట్లాడారు.

ఉప్పలగుప్తం: ఈనెల8న మండలంలోని 72ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, 8ఉన్నత పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ తెలిపారు. ఈఎన్నికలకు తల్లిదండ్రులు గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు.

అల్లవరం: గురువారం ఉదయం 8గంటల నుంచి మండలంలోని ప్రతి పాఠశాలలో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరుగుతాయని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. మండలంలో 62ప్రాథమిక, 6ప్రాథమికోన్నత, 9హైస్కూల్స్, 2గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. ఎన్నికలుప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు.

బీవీసీలో ఐటీ స్కిల్‌పై వర్క్‌షాపు ప్రారంభం

అల్లవరం, ఆగస్టు5: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, బీవీసీ కళాశాల ఆధ్వర్యంలో సీఎస్‌సీ విద్యార్థులకు ఐటీ స్కిల్ ప్రోగ్రాంలో భాగంగా వర్క్‌షాపు ప్రారంభమైంది. క్లౌడ్ కంప్యూటింగ్ అధునాతన పరిజ్ఞానం అంశాలపై శిక్షణను ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్‌గా కార్పొరేషన్ నుంచి లోవబాబు వ్యవహరించారు. కళాశాల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి, ఏ.ప్రవీణ్, డాక్టర్ బీఎస్ఎన్ మూర్తి, మధుకుమార్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శివం భజే
శ్రీలలిత	: తిరగబడరా సామి
శేఖర్ స్ర్కీన్-1	: బడ్డీ
శేఖర్ స్ర్కీన్-2	: అలనాటి రామచంద్రుడు
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: డెడ్ పూల్

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మండపేట, ఆగస్టు 5: స్థానిక సాయి ఆర్థోపెటిక్ ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటుచేసిన ఉచితవైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన రామును ఆయన అభినందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, పాలచర్ల శిరీష్, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, అప్పన్న బాబు, గుండు తాతరాజు, గడి రాంబాబు, శెట్టిరవి, కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మండపేట, ఆగస్టు 5: పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కమిషనర్ బి.రాము పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు నేపథ్యంలో పలు వార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

వ్యాధిగ్రస్త బాలికకు సాయం

మామిడికుదురు, ఆగస్టు 5: అప్పనపల్లికి చెందిన 13ఏళ్ల ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతుంది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.50వేలు, హెచ్ఎం సూర్యప్రకాశరావు రూ.2వేలు సోమవారం ఆమెకు అందజేశారు.

పుంత రోడ్లు అభివృద్ధి చేయాలి

రాయవరం, ఆగస్టు5: సోమేశ్వరంలో పొలాలకు వెళ్లే పుంతరోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడానికి ఉపయోగపడే ఈరహదారులను అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చక్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, చీరట్ల సుబ్బారావు, ఈరెళ్ళ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఆదినారాయణకు సత్కారం

అల్లవరం, ఆగస్టు 5: అల్లవరం జడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బొల్లం ఆదినారాయణను గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బండిగుప్తాపు పాండురంగా, నిచ్చనకోళ్ల సుదర్శనరావు, కొనుకు బాపూజీ, గెద్దాడ శ్రీనివాసరావు, హెచ్ఎం నైనాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ యానిమేటర్ మాకొద్దు

అంబాజీపేట, ఆగస్టు 5: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం కె.పెదపూడి గ్రామపరిధిలో 30డ్వాక్రా సంఘాలకు ఏర్పాటుచేసిన యానిమేటర్(వీఓఏ) మాకొద్దంటూఆయా సంఘాల సభ్యులు నిరసన తెలిపారు. కె.పెదపూడిలో 90డ్వాక్రా సంఘాలుగా ఉండగా గతంతో ముగ్గురు యానిమేటర్లు విధులు నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వంలో యానిమేటర్ చింతపల్లి మంగాదేవిని విధుల్లోకి తీసుకున్నారు. ఆమెను గ్రామంలో 30సంఘాలకు నియమించారు. యానిమేటర్ మంగాదేవి మాకొద్దంటూ నిరసన తెలిపారు. గ్రామ సంఘాలకు తెలియకుండా యానిమేటర్‌ను నియమించారని ఐకేపీ ఏపీఎం గంగాధరరావుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో శ్రీనిధి సొమ్ములు తీసుకోని గ్రూపు సభ్యులపై కేసులు పెడాతామని ఐకేపీ అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ యానిమేటర్‌ను మా సంఘాల నుంచి తొలగించాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ సాయం

అమలాపురం రూరల్, ఆగస్టు 5: భారతీయ స్టేట్‌బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సోమవారం పేరూరు శివారు కొంకాపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వివిధ రకాల వస్తువులను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి సోలార్ ప్యానల్‌తో పాటు లైట్లు, కుక్కర్లు, ఆట వస్తువులను ఎస్బీఐ రీజనల్ మేనేజర్ ఎంవీఎం కృష్ణ పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి అరుణ, ఎంపీటీసీ పనసా బుజ్జి, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


ఎంటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కేశవకుమార్

అంబాజీపేట, ఆగస్టు 5: మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా అంబాజీపేటకు చెందిన చొల్లంగి కేశవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఎస్టీయూ అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ పర్యవేక్షణలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంటీఎస్ యూనియన్ ఎస్టీయూ అనుబంధ యూనియన్‌గా పని చేయాలని తీర్మానం చేశారు. 25ఏళ్ల సర్వీసు కోల్పోయిన ఎంటీఎస్ ఉద్యోగులకు ఫిక్సిడ్ పెన్షన్ ఇవ్వాలని కేశవకుమార్ కోరారు. కార్యదర్శిగా మార్తాండరాజు, ఆర్థిక కార్యదర్శిగా కె.రామాలయ్య, ఎం.రాఘవేంద్రరావు, ఎస్టీయూ నాయకులు బోనం గంగాధర్, కె.సుబ్బారావు, ఎంటీఎస్ నాయకులు అల్లు వజ్రకుమార్, ఎం.ఫణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు పాస్‌లు

ద్రాక్షారామ, ఆగస్టు 5:ఉపాధ్యాయుడు సూచనతో ద్రాక్షారామజడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అభిరుచి స్వీట్ స్టాల్ అధినేత చోడిశెట్టి వీరభద్రరావు ఆర్టీసీకి రూ.10వేలు చెల్లించి ఉచితంగా ఆర్టీసీ బస్సులు పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నపద్మావతి, జిల్లా సైన్సు అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ, మెహర్ సుజాత, కోడి ప్రసాద్, అరవవిస్సు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం ఎస్ఐగా జ్వాలాసాగర్



ముమ్మిడివరం, ఆగస్టు 5: ముమ్మిడివరం ఎస్ఐగా డి.జ్వాలాసాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన డి.సురేష్‌బాబు మండపేట రూరల్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐకు సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

రూ.1.10లక్షలు సాయం

కపిలేశ్వరపురం, ఆగస్టు5: ఇటీవల ప్రమాదవశాస్తు గాయపడిన కేదార్లంకకు చెందిన సదా సుబ్రహ్మణ్యంను సోమవారం జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ పరామర్శించారు. జనసేవాదళ్ సంస్థ, అంగర గ్రామస్థులు సమకూర్చిన రూ.1.10లక్షలను లీలాకృష్ణ బాధిత కుటుంబానికి అందజేశారు. ఆ కుటుంబానికి పార్టీ తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామస్థులు, జనసేవాదళ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బోట్ ఇంజన్ లోపాలపై అవగాహన సదస్సు

యానాం, అగస్టు 5: యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల్లో మూడు రోజులు ఇంజిన్ లోపాలు సరిదిద్దటం, నిర్వహణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం గిరియాంపేట, సావిత్రినగర్ గ్రామాల్లోని మత్స్యకారులకు పీఎంఎంఎస్ పథకం ద్వారా ఎన్ఎఫ్‌డీబీ నిధులతో మత్స్యశాఖ, పుదుచ్చేరి ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో ఇంజిన్ లోపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐఎఫ్ఎస్ఐటీకి చెందిన అధికారులు వి.ఎస్.పూజర్, హరనాధ్, అర్జున్, యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతయ్య తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఆగస్టు 5: ప్రముఖ ప్రైవేటు కంపెనీ కేఎల్ గ్రూపు (చెన్నై)లో పనిచేసేందుకు ఈనెల8న అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి యి.వసంతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.18వేలు వేతనం అందజేస్తారన్నారు. పదో తరగతి, ఆపై చదువుకున్న స్త్రీ, పురుష అభ్యర్థులు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో 8వ తేదీ ఉదయం 10.30గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ 8121838392ను సంప్రదించాలన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్టు

అంబాజీపేట, ఆగస్టు5: ఏఎస్ఐపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఈనెల3వ తేదీ అర్ధరాత్రి ఒక యువతితో గంగలకుర్రుకు చెందిన బూడిద విజయ్ మాట్లాడుతున్నాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు చూసి విజయ్‌ను వారించారు. ఎంత చెప్పినా అతడు అక్కడ నుంచి వెళ్లకపోవడంతో ఆ యువతి తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ సూర్యనారాయణ, మరో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి విజయ్‌ను వెళ్లిపోవాలని సూచించారు. ఏఎస్ఐపై అతడు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. ఆ యువకుడ్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మద్యం మత్తులో ఉన్న విజయ్ స్టేషన్‌లో ఉన్న అద్దాన్ని తలతో ఢీకొట్టుకున్నాడు. ఏఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం విజయ్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి.. నగదు మాయం

పి.గన్నవరం,ఆగస్టు5: వైకొత్తపల్లికి చెందిన తోరం నాగవెంకటదుర్గ బ్యాంకు ఖాతా నుంచి ఏటీఎం కార్డు ద్వారా గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు కాజేశాడు. సోమవారం వెంకటదుర్గ కుమారుడితో కలిసి పి.గన్నవరంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం ద్వారా రూ.5వేలు విత్‌డ్రా చేశారు. ఏటీఎం వద్ద మరో వ్యక్తి సాయం తీసుకుని తన కార్డును ఆ వ్యక్తికి ఇచ్చి డబ్బులు తీసినట్లు ఆమె తెలిపింది. అయితే డబ్బులు తీసిన 11నిమిషాలకు రూ.9వేలు డ్రా చేసినట్లు తన భర్త సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వచ్చిందని ఆమె తెలిపింది. తన కార్డును ఆ వ్యక్తి తీసుకుని మరో కార్డును ఇచ్చినట్లు గుర్తించామని, బ్యాంకుకు వెళ్లి తన కార్డును బ్లాక్ చేయించినట్టు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

జ్వరాలపై సర్వే నిర్వహించాలి

అంబాజీపేట, ఆగస్టు 5: గంగలకుర్రు అగ్రహారంలో రెండు డెంగ్యూ కేసులు నమోదైన నేపధ్యంలో ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహించాలని సబ్ యూనిట్ అధికారి ఎన్వీ రామారావు సూచించారు. జైభీమ్‌నగర్‌లో డెంగ్యూ కేసులపై ఆయన సమీక్షించారు. దోమల నివారణకు ఎబేట్ మందును పిచికారీ చేయించాలన్నారు. సీహెచ్‌వో బి.అప్పారావు, ఈవోపీర్డీ మమత, సర్పంచ్ దొంగ నాగేశ్వరారవు, ఉపసర్పంచ్ బందన రాంబాబు, వైద్య సిబ్బంది జీవీవీకే ప్రసాద్, మురళీకృష్ణ, జేఎస్వీ ప్రసాద్, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు.